


ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటుకు 5,574 దరఖాస్తులు

విజయనగరం, కలెక్టరేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు హక్కు కోసం జిల్లాలో 5,574 దరఖాస్తులు వచ్చాయి. తొలుత గత నెల 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం గడువు ఇచ్చింది. అప్పటికి 3,837 మంది దరఖాస్తు చేసుకున్నారు. తరువాత ఈ నెల 9 వరకూ ప్రభుత్వం గడువు పెంచింది. దీంతో మరో 1,737 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 1322 ఆఫ్‌లైన్‌లో, 415ఆన్‌లైన్‌లో దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 30న తుది జాబితా విడుదల చేయనున్నారు. 2019లో జిల్లా వ్యాప్తంగా 2,274 దరఖాస్తులు వచ్చాయి. ఈ సారి మరో 3,300 వరకూ దరఖాస్తులు పెరిగాయి.

ప్రజారోగ్యం.. భద్రం





- కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు హెచ్చరిక
- డయేరియా ఘటనను ఉద్దేశిస్తూ వ్యాఖ్యలు
- జూన్ నాటికే యాక్షన్ ప్లాన్‌లోకి దిగాలని ఆదేశం
- ఉమ్మడి జిల్లాలో అస్తవ్యస్తంగా వైద్య ఆరోగ్య శాఖ

'జిల్లాల్లో యంత్రాంగం అసమర్థత వల్లే డయేరియా ఘటనలు జరుగుతున్నాయి. విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లో డయేరియా ఘటనలకు యంత్రాంగం నిర్లక్ష్యమే కారణం. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గత ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకోక పోవడం ముమ్మాటికీ తప్పిదమే. మరోసారి ఈ ఘటనలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోండి. వచ్చే జూన్ ప్రారంభం నాటికి వైద్య ఆరోగ్య శాఖపరంగా యాక్షన్ ప్లాన్‌లోకి రావాలి. మరోసారి డయేరియా ఘటనలు పునరావృతమైతే అది యంత్రాంగం తప్పిదమే. దానిపై కఠిన చర్యలుంటాయి'.. అమరావతిలో జరిగిన కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు నాయుడి హెచ్చరిక ఇది.

విజయనగరం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలో ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం రాష్ట్రస్థాయిలో కూడా చర్చకు దారితీసింది. అందుకే కూటమి ప్రభుత్వం దీనిపై ఫోకస్ పెట్టింది. గత ఐదేళ్ల పాటు కొనసాగిన నిర్లక్ష్యాన్ని నియంత్రించాలని భావిస్తోంది. ఇందులో భాగంగానే సీఎం చంద్రబాబు నాయుడు విజయనగరంతో పాటు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్లకు హితోపదేశం చేశారు. కొద్దినెలల కిందట జిల్లాలో డయేరియాతో పలు ఆరోగ్య సమస్యలు, ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో ప్రభుత్వం అప్రమత్తమై సమస్యల పరిష్కారం దిశగా చర్యలు చేపట్టింది.

సీజనల్ వ్యాధులతో ఇక్కట్లు..

గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఒక్క డయేరియా కాదు సీజనల్ వ్యాధులు ముసురుకుంటున్నాయి. జ్వరపీడితులు, డయేరియా బాధితులతో ఆస్పత్రులు నిండిపోతున్నాయి. ఏటా వర్షాకాలం నాటికి వైద్యారోగ్య శాఖ ముందస్తు చర్యలు చేపట్టేది కానీ ఈ ఏడాది ఆ ప్రణాళిక కొరవడింది. దీనికితోడు గ్రామాల్లో పారిశుధ్య పనులు నిలిచిపోవడంతో దోమలు స్వైర విహారం చేసి వ్యాధులు పెరిగాయి. ల్లా కేంద్రాస్పత్రితో పాటు పార్వతీపురంలో ఏరియా ఆస్పత్రి ఉంది. 11 సామాజిక ఆస్పత్రులు, 60 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు) ఉన్నాయి. వేలాది మంది వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఏటా వర్షాకాలం ముందస్తుగా సీజనల్ వ్యాధులు ఎదుర్కోవడంపై ప్రణాళిక సిద్ధం చేసేవారు. ప్రమాద కర జ్వరాలు, వ్యాధుల నియంత్రణకు ఎలా ముందు కెళ్లాలి? అన్నదానిపై ఉన్నతస్థాయిలో సమీక్షించే వారు. ఆస్పత్రుల్లో అన్నిరకాల మందులు అందుబా టులో ఉంచేవారు. కానీ ఎందుకో ఈ ఏడాది యం త్రాంగం పెద్దగా పట్టించుకోలేదు. ఎన్నికల ఏడాది కావడంతో ఎలక్షన్ కమిషన్ పరిధిలో యంత్రాంగం వెళ్లిపోయింది. అందుకే ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం చేసినట్టు అర్థమవుతోంది.

పారిశుధ్య పనులు జరగక..

గత ఐదు సంవత్సరాలుగా గ్రామాల్లో దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి. కనీసం పారిశుధ్య పనులు చేపట్టడానికి వీలులేని పరిస్థితి. కొన్ని చిన్న పంచాయతీల్లో కనీస స్థాయిలో నిధులు లేవు. కేంద్రం అందించే ఆర్థిక సంఘం నిధులు కూడా వివిధ పద్దుల కింద ఇతర బకాయిలకు సర్దుబాటు చేశారు. జిల్లాలో 777 పంచాయతీల్లో.. కొన్ని మాత్రమే సొంతంగా నిధులు సర్దుబాటు చేసుకునేవి. మిగతావి గడ్డు పరిస్థితులను ఎదుర్కొన్నాయి. కనీసం పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించుకోలేని స్థితిలోకి కొన్ని గ్రామ పంచాయతీలు ఉన్నాయి.

వైద్యులు, సిబ్బంది కొరత..

ఉమ్మడి జిల్లాలో పెద్దాస్పత్రులు, సీహెచ్‌సీల్లో వైద్యుల కొరత వెంటాడుతోంది. ప్రధానంగా వైద్య విధాన పరిషత్ పరిధిలో పనిచేస్తున్న 12 ఆస్పత్రుల్లో 30 మంది వైద్యులు, 67 మంది సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో వైద్య విధాన పరిషత్ పరిధిలో పార్వతీపురం, ఎస్.కోట, సాలూరు, రాజాం, పాలకొండ ఏరియా ఆస్పత్రులు ఉన్నాయి. వీటితో పాటు గజపతినగరం, బాడంగి, భోగాపురం, నెల్లిమర్ల, చీపురుపల్లి, బొబ్బిలి, కురుపాం, భద్రగిరి, చినమేరంగి సీహెచ్‌సీలు ఉన్నాయి. అయితే ఈ ఆస్పత్రుల పరిధిలో 198 మంది వైద్యులు ఉండాలి. కానీ ఉన్నది 168 మంది మాత్రమే. దీంతో 30 మంది వైద్యుల కొరత ఉంది. అయితే ఉన్న వైద్యుల్లో సైతం ఉన్నత చదువులు, మహిళా వైద్యులు వివిధ అవసరాల నిమిత్తం దీర్ఘకాలిక సెలవులపై ఉన్నారు. దీంతో ఉన్న కొద్దిమందిపై భారం పడుతోంది. రోగుల వైద్యసేవలపై ప్రభావం చూపుతోంది. ప్రధానంగా ఈఎన్‌టీ, సైకాలజీ, పీడియాట్రిక్, రేడియోలజీ, ఫోరెనిక్స్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థో, గైనకాలజీ, అప్తాలమిక్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మత్తు వైద్యుల కొరత సైతం వేధిస్తోంది. దీంతో ఆపరేషన్లు, కుటుంబ శస్త్రచికిత్సల సమయంలో ఇతర ఆస్పత్రుల నుంచి మత్తు వైద్యులను తెప్పించుకోవాల్సి వస్తోంది.

పారా మెడికల్ సిబ్బంది కొరతే..

ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులతో పాటు ఇతర సిబ్బందిది కీలక పాత్ర. పారా మెడికల్ సిబ్బంది ఉంటేనే రోగులకు సక్రమంగా వైద్యసేవలు అందుతాయి. కానీ గత కొన్నేళ్లుగా పారా మెడికల్ సిబ్బంది నియామకం చేపట్టలేదు. దీంతో ప్రతి ఆస్పత్రిలో ఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలోని వైద్యవిధాన పరిషత్‌లోని ఈ ఆస్పత్రుల్లో 350 మంది సిబ్బంది అవసరం. కానీ ఉన్నది 298 మంది మాత్రమే. అందులోనూ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది మాత్రమే ఉన్నారు. రెగ్యులర్ సిబ్బంది చాలా తక్కువగా ఉన్నారు. రేడియోగ్రాఫర్, సూపర్‌వైజర్, ఫార్మసీ సూపర్‌వైజర్ గ్రేడ్-1, గ్రేడ్-2, థియేటర్ అసిస్టెంట్, ల్యాబ్ టెక్నీషియన్, డార్క్ రూమ్ అసిస్టెంట్, ఆడియో మెట్రిసిన్, బయో మెడికల్ ఇంజనీర్, థెరపిస్టు, ల్యాబ్ అటెండెంట్, రికార్డ్ అసిస్టెంట్స్, ఆఫీస్ అడ్మినిస్ట్రేటివ్స్ వంటి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటన్నింటిపై దృష్టిపెడితే ప్రజారోగ్యం కొంత గాడిలో పడే అవకాశముంది. మరి యంత్రాంగం ఎలాంటి దిద్దుబాటు చర్యలకు దిగుతుందో చూడాలి.

ప్రజారోగ్యానికి పెద్దపీట..

ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా యాక్షన్ ప్లాన్ రూపొందిస్తాం. జిల్లాలో అందరికీ ఆరోగ్యం అందుబాటులో ఉండేటట్లు ఇప్పటికే క్షేత్రస్థాయి, వైద్యసిబ్బందికి ఆదేశాలిచ్చాం. ఇంటింటికి వెళ్లి సర్వేస్తున్నారు. ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతాం. ప్రజలు కూడా సహకరించాలి. అప్పుడే ప్రజారోగ్యం సాధ్యం. అన్నీ పీహెచ్‌సీల్లో మందులు అందుబాటులో ఉన్నాయి.

-భాస్కరరావు, డీఎంహెచ్‌వో, విజయనగరం

గంజాయి కేసులో ముగ్గురి అరెస్టు

- పోలీసు వాహన నెంబర్‌తో అక్రమ రవాణా
- రూ.40 లక్షల విలువైన సరుకు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

రామభద్రపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొట్టక్కి చెక్‌పోస్టు వద్ద గురువారం పట్టుబడిన గంజాయి కేసులో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శుక్రవారం నిందితులను విలేకరుల ముందు హాజరుపరిచారు. ఈ వివరాలను డీఎస్పీ వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం పాడువ నుంచి మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌కు గంజాయిని అక్రమ రవాణా చేస్తున్నట్టు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో అప్రమత్తమై మెరుపుదాడి చేసి రవాణాను అడ్డుకున్నారు. బొలేరో, టాటా మేజిక్ వాహనాల్లో 30 సంచులతో 810 కిలోల గంజాయిని పాచిపెంట మండలం వరకు తీసుకొచ్చారు. అక్కడ గంగవరం పోర్టు నుంచి బొగ్గు లోడుతో సాలూరు వైపు వస్తున్న లారీలో గంజాయిని ఎక్కించారు. పైన బొగ్గుల బస్తాలు కప్పి ఉంచారు. కొట్టక్కి చెక్ పోస్టువద్ద సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.నారాయణరావు, ఎస్ఐ వెలమలప్రసాద్, పోలీసు సిబ్బంది ఈ లారీని తనిఖీ చేయగా రూ.40లక్షల విలువైన గంజాయి పట్టుబడింది. ఈ కేసులో మధ్యప్రదేశ్‌కు చెందిన లారీ డ్రైవర్ హుకుం సోలంకి, అతని కుమారుడు అనిల్ సోలంకి, ఒడిశా రాష్ట్రం కోరాపుట్‌కు చెందిన జ్యోతిభూషణ్ బెహరాను అరెస్టు చేసి సాలూరు కోర్టులో హాజరుపర్చినట్లు డీఎస్పీ తెలిపారు. బొలేరో, టాటా మేజిక్ వాహనాల్లో వస్తున్న కొంతమంది పరారైనట్లు చెప్పారు. బొలేరో వాహనానికి పోలీసు నెంబరు ప్లేటు, టాటా ఏసీ మేజిక్ వాహనానికి ఫేక్ నెంబర్ ప్లేట్లను అమర్చి గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ ముఠా వెనక పెద్ద నెట్‌వర్కు ఉందన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు నిందితుల ఆస్తులపై కూడా విచారణ చేస్తామన్నారు. మూడు వాహనాలతో పాటు 4 సెల్‌ఫోన్లు, రూ.7,405ల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారైన వారికోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గంజాయి అక్రమ రవాణాను నిరోధించడంలో బొబ్బిలిరూరల్ సీఐ, ఎస్ఐతో పాటు కానిస్టేబుల్ బాలి విశ్వేశ్వరరావు (విష్ణు) ఎంతో చాకచక్యంగా వ్యవహరించారని, వారికి రివార్డుల కోసం పోలీసుశాఖకు సిఫారసు చేస్తామని తెలిపారు.

ఉపాధి పనుల్లో మాయాజాలం

- ఆన్‌లైన్‌లోనే పురోగతి
- క్షేత్రస్థాయిలో దీనస్థితి
- తప్పుడు మస్తర్లతో నాటకం
- జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి

ఉపాధి హామీ పథకంలో భాగంగా మెంటాడ మండలంలోని 29 పంచాయతీలకు సుమారు రూ.6కోట్లతో 120 పనులు మంజూరయ్యాయి. వాటిని గత నెల 26లోగా పూర్తి చేయాల్సి ఉంది. కానీ, ఇప్పటి వరకు కేవలం 18 పనులే ప్రారంభించారు. ఇందులో 11 పనులు పూర్తయ్యాయి. 7 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. దీన్ని కప్పిపుచ్చుకునేందుకు స్థానిక నేతలు ఒకరిద్దరితో మస్తర్ల నాటకం నడిపి, అన్ని పనులు పురోగతిలో ఉన్నట్టు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. జిల్లాలో నాలుగైదు మండలాల్లో మినహా అన్ని చోట్లా ఇదే తీరు.



మెంటాడ మండలం పిట్టాడ గ్రామంలో ఉపాధి నిధులతో నిర్మిస్తున్న కాలువ

మెంటాడ (ఆంధ్రజ్యోతి) డిసెంబరు 13: జిల్లాలో ఉపాధి హామీ పథకం పనుల్లో మాయాజాలం నెలకొంది. క్షేత్రస్థాయిలో ఎలాంటి పనులు చేపట్టకపోయినా ఆన్‌లైన్‌లో మాత్రం పురోగతిలో ఉన్నట్లు నమోదు చేస్తున్నారు. ఒకరిద్దరితో తప్పుడు మస్తర్లు వేయించి పనులు చేస్తున్నట్లు కలరింగ్ ఇస్తున్నారు. అధికారులు, కాంట్రాక్టర్ల ఉదాసీనత రాష్ట్ర ప్రభుత్వ ఆశయాన్ని దెబ్బతీస్తున్నాయి. ఉపాధి హామీ పథకాన్ని కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. పల్లె పండగ పేరిట ఒకేసారి గ్రామసభలు నిర్వహించి వివిధ పనులకు పచ్చజెండా ఊపింది. పనుల పూర్తికి రూట్ మ్యాపును రూపొం దించి, వాటి పూర్తికి నిర్దిష్ట గడువు విధించింది. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని మండలాల్లో ఆమోదించబడిన పనులను గత నెల 26లోగా పూర్తి చేయాలని ఆదేశించింది. ఈ మేరకు కలెక్టర్ అంబేడ్కర్ సైతం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామసభల్లో ప్రతి గ్రామం నుంచి వచ్చిన ప్రతిపాదనలను మండలం యూనిట్‌గా క్రోడీకరించి, మండలాన్ని బట్టి కనిష్ఠంగా 120 నుంచి 150 పనులకు గాను రూ.6కోట్ల నుంచి రూ.8 కోట్ల వరకు అంచనా వ్యయం రూపొందించారు. దీంతో అన్ని మండలాల్లో ఈ పనులను ఉత్సాహంగా ప్రారంభించారు. తరువాత ఏమైందో గానీ ఆ ఉత్సాహం సన్నగిల్లింది. ఫలితంగా పనుల పురోగతి మందగించిం ది. పనుల గడువు దగ్గరపడ్డాక హైరానా కనిపించింది. ఎంత జెట్ స్పీడుతో చేసినా డెడ్‌లైన్‌లోగా పనులు పూర్తిచేయడం అసాధ్య మని గుర్తించారు. దీంతో సొంత తెలివి తేటలకు పదును పెట్టారు. పనులకు కొబ్బరికాయ కొట్టకపోతే కలెక్టర్‌తో అక్షింతలు తప్పవని భావించి, పనులు మొదలు పెట్టేసినట్టుగా కలరింగ్ ఇచ్చారు. స్థానిక కూటమి నేతలు తమ చెప్పు చేతల్లో ఉండే ఒకరిద్దరు ఉపాధి కూలీలను రప్పించి వారికి మస్తర్లు వేసి పనులు ప్రారంభించినట్టు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. పనులు రద్దుకాకుండా ఈ జిమ్మిక్కు చేశారు. ఒకసారి ఆన్‌లైన్‌లో నమోదు అయ్యాక ప్రోసెస్‌లో ఉన్నట్టు చూపే ఎత్తుగడను అమలు చేశారు. నాలుగైదు మండలాల్లో మినహా మిగిలిన అన్నిచోట్లా కూడబలికిన ట్లుగా దీన్నే అమలు చేశారు. మట్టి పనులను ఉపాధి వేతనదారులతోనే చేయించాలి. యంత్రాలను ఉపయోగించకూడదు. కానీ, కొన్నిచోట్ల యంత్రాలతో పని చేయిస్తూ ఒకరిద్దరి మస్తర్లు వేసి అధికారుల కళ్లకు గంతలు కట్టే ప్రయత్నం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పేరుకు ఉపాధి హామీ పనులు అయినప్పటికీ, పంచాయతీరాజ్ అధికారుల పర్యవేక్షణలో అవి జరుగుతున్నాయి. ఈ అక్రమాలు తెలిసినా ఉపాధి సిబ్బంది మౌనం దాలుస్తున్నారు. ఈ విషయం కలెక్టర్ అంబేడ్కర్‌కు తెలియడంతో ఆయన సీరియస్ అయినట్లు తెలిసింది. ఒక ట్రెండు మస్తర్లు వేసి పనులు చేస్తున్నామంటే కుదరదని, వాటిని త్వరితంగా పూర్తి చేయాల్సిందేనని ఆదేశించినట్లు సమాచారం.

18 పనులు ప్రారంభమయ్యాయి

మెంటాడ మండలంలో 120 పనులకు గాను 18 పనులు మాత్రమే ప్రారంభమయ్యాయి. కొందరు పనులు ప్రారంభిస్తాం అంటున్నారు. కొందరు స్పందించడం లేదు. రోడ్లు, కాలువల నిర్మాణంలో ఎర్త్ వర్క్‌ను మిషన్లతో చేయకూడదు. వాటికి బిల్లులు చెల్లించడం జరగదు.

-గౌతమ్, జేఈ, పంచాయతీరాజ్, మెంటాడ

అప్పడం కేరాఫ్ ఉంగరాడ

- 32 ఏళ్లుగా తయారీ
- మార్కెట్లో మంచి డిమాండ్
- ఉత్తరాంధ్రతో పాటు ఒడిశాకు రవాణా
- తయారీదారులకు ప్రోత్సాహం కరువు

6లో



రైతులు లేకుండానే..

- మొక్కుబడిగా 'అన్నదాతకు అండగా వైసీపీ' కార్యక్రమం
- కార్యకర్తలు కూడా ముఖం చాటేశారు

విజయనగరం (ఆంధ్రజ్యోతి), డిసెంబరు 13: వైసీపీ తలపెట్టిన నిరసన కార్యక్రమం జిల్లాలో మొక్కుబడిగా సాగింది. 'అన్నదాతకు అండగా వైసీపీ' పేరిట శుక్రవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైతులు ఎవరూ పాల్గొనలేదు. కేవలం పార్టీ నాయకులతోనే మమ అనిపించేశారు. కేవలం రాజకీయ దురుద్దేశ్యంతో, ప్రభుత్వంపై బురదజల్లిందుకే ఈ కార్యక్రమం నిర్వహించారని ప్రజలు మండిపడుతున్నారు. వైసీపీ నాయకులను ప్రజలు ఎక్కడ మరిచిపోతారోనని ఇలాంటి పసలేని కార్యక్రమాలను చేపడుతున్నారని ప్రజలు, రైతులు ఆరోపిస్తున్నారు. వైసీపీ నాయకులు చెబుతున్నట్లు కూటమి ప్రభుత్వంలో రైతులకు నష్టం కలిగిఉంటే, వారే ప్రభుత్వాన్ని ప్రశ్నించేవారు. కానీ, ఎక్కడ అలాంటి పరిస్థితిలేదు. ఖరీఫ్‌కు సంబంధించి ప్రభుత్వం రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించింది. ధాన్యం కొనుగోలు కూడా ముమ్మరంగా జరుగుతున్నాయి. 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి బిల్లులు జమ చేస్తోంది. ఈ నేపథ్యంలో రైతుల ఎవరూ వైసీపీ నిరసన కార్యక్రమంలో పాల్గొనలేదు. రైతు సంఘాలు కూడా మద్దతు పలకలేదు. ఓటమితో నైరాశ్యంలో ఉన్న వైసీపీ కార్యకర్తలు సైతం ఈ కార్యక్రమానికి ముఖం చాటేశారు. తప్పదన్న రీతిలో జిల్లాలోని ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేసిన వారు హాజరయ్యారు. వారు కూడా ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేయలేదు. తూతూ మంత్రంగా ధర్నా నిర్వహించి జేసీ సేతుమాధవన్‌కు వినతిపత్రం అందించి వెళ్లిపోయారు.



నిరసన కార్యక్రమంలో కేవలం వైసీపీ నాయకులే పాల్గొన్న దృశ్యం

నేడే సాగునీటి సంఘాల ఎన్నికలు

- 398 సంఘాలకు నిర్వహణ
- 5,680 సిబ్బందికి విధుల కేటాయింపు
- 2,690 కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి

విజయనగరం, కలెక్టరేట్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం జరగనున్నాయి. దీనికి సంబం ధించి జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లా వ్యాప్తంగా ఏడు మేజర్, 46 మీడియం, 345 మైనర్ మొత్తం 398 సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. 3.12లక్షల మంది రైతులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. దాదాపు 2,690 కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణ కోసం సుమారు 5,680 సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. ఓటు వేసేందుకు రైతులు పోలింగ్ కేంద్రానికి ఉదయం 8 నుంచి 9 గంటలలోపు చేరుకోవాలి. ఆధార్ కార్డుతో పాటు పట్టాదారు పాసుపుస్తకం లేదా 1బీ, ఏదో ఒక ఐడీ ప్రూఫ్ తీసుకుని వెళ్లాలి. ఓటర్లలో ఏకాభిప్రాయం రానప్పుడు ఉదయం 10.30 గంటలు నుంచి మధ్యాహ్నం 1.30 వరకూ ప్రాదేశిక నియోజకవర్గ (టీసీ మెంబరు) ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. దీన్ని చేతులు ఎత్తడం, లేదా రహస్య ఓటింగ్ విధానం ద్వారా నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచి 12 గంటలు వరకూ ఎన్నిక జరగనుంది. 3 గంటల తరువాత లెక్కింపు నిర్వహిస్తారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని జేసీ సేతుమాధవన్ తెలిపారు.

- 32 ఏళ్లుగా తయారీ
- మార్కెట్లో మంచి డిమాండ్
- ఉత్తరాంధ్రతో పాటు ఒడిశాకు రవాణా
- తయారీదారులకు ప్రోత్సాహం కరువు

అప్పడం కేరాఫ్ ఉంగరాడ



ఉంగరాడ గ్రామంలోని ఓ వీధిలో ఆరబెట్టిన అప్పడాలు

రేగిడి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెళ్లిళ్లు, ఇతర విందు భోజనాలంటే ముందుగా గుర్తుకొచ్చేది అప్పడం. ఎన్నిరకాల వంటకాలు ఆకుపై ఉన్నా అప్పడం లేకపోతే ఆ లోటు స్పష్టంగా కనిపిస్తుంది. అటువంటి అప్పడాల తయారీకి కేరాఫ్ అడ్రా‌స్‌గా మారింది రేగిడి మండలంలోని ఉంగరాడ గ్రామం. ఈ గ్రామంలో కాలుపెట్టిన వారికి వీధివీధంతా అప్పడాల పరిచిన మంచాలు స్వాగతం పలుకుతాయి. ఇళ్ల ఆవరణాల్లో మహిళలు అప్పడాలు తయారీతో బిజీగా ఉండడం కనిపిస్తారు. ఇక్కడి అప్పడాలకు ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశాలోని చాలా ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంది. గత 32 ఏళ్లుగా దాదాపు 45 వైశ్య కుటుంబాలు ఈ వృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్నాయి. దీని వల్ల పరోక్షంగా మరో 100 మంది వరకు ఉపాధి దొరుకుతుంది. అప్పడాల తయారీ కుటీర పరిశ్రమంగా వెలుగొందుతోంది.



వివిధ ప్యాకెట్లలో అప్పడాలు

32 ఏళ్ల కిందట ప్రారంభం..

పేద, మధ్యతరగతి వారు తమ రోజువారి భోజనాల్లో అప్పడాలు వినియోగించడం పరిపాటిగా ఉంటుంది. దీన్ని ఉంగరాడ వైశ్య కుటుంబాలు గుర్తించాయి. 32 ఏళ్ల కిందట గ్రామానికి చెందిన వారణాసి గురుమూర్తి, ఇప్పలి అప్పారావు, ఇప్పిలి రామ్ తదితరులు అప్పడాల వ్యాపారం ప్రారంభించారు. అప్పట్లో ఆ గ్రామానికే పరిమితమైన ఈ వ్యాపారం రానురాను విస్తరించింది. కాలక్రమంలో గ్రామంలోని వైశ్య కుటుంబాలు అన్నింటికీ ఇదే ఉపాధి అయింది. ప్రతి కుటుంబం రోజుకు వెయ్యి నుంచి గరిష్ఠంగా 1,600 అప్పడాలు తయారీ చేస్తుంది. దీనికోసం కొందరు కూలీలను పెట్టుకుంటారు. గతంలో వీరికి రోజు కూలి ఇచ్చేవారు. ప్రస్తుతం ఉన్న డిమాండ్‌తో కేజీ అప్పడాల ముద్దకు రూ.25 నుంచి రూ.30 వరకు కూలి చెల్లిస్తున్నారు.

దూరప్రాంతాలకు రవాణా..

అప్పడాల తయారీకి అవసరమైన ముడిసరుకులు నువ్వులు, మినప గింజలు, కారం, నూనె, ఇంగువా, సోడాగుండను విజయనగరం, రాజాం మార్కెట్ల నుంచి కొనుగోలు చేసి తెస్తుంటారు. వాతావరణం బాగుంటే గరిష్ఠంగా రోజుకు 10 నుంచి 20 కేజీల వరకు అప్పడాల ముద్ద కలిపి తయారీ చేస్తుంటారు. మొదట్లో ఒకట్రెండు రకాల అప్పడాలే తయారు చేసేవారు. కాలక్రమంలో డిమాండ్‌ను బట్టి, ఇతర తయారీదారుల పోటీని తట్టుకొనేందుకు ప్రస్తుతం అనేక రకాల అప్పడాలు తయారీ చేస్తున్నారు. వివిధ పరిమాణాల్లో తయారైన అప్పడాలను ప్యాకింగ్ చేసి దూర ప్రాంతాలకు రవాణా చేస్తుంటారు. నాణ్యత, రకాన్ని బట్టి ఒక ప్యాకెట్ (10 అప్పడాలు)ను రూ.10, రూ.20, రూ.50 వరకు హోల్‌సేల్ షాపులకు విక్రయిస్తుంటారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాలతో పాటు ఒడిశాలోని రాయిఘడ్, అంబాదర్, నవరంగపూర్ తదితర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తుంటారు. స్థానికంగా పాలకొండ, రాజాం, సాలూరు. బొబ్బిలి, వీరఘట్టం. పార్వతీపురం తదితర పట్టణాల్లో అమ్ముతుంటారు. కాగా, ఎన్ని ప్రభుత్వాలు వస్తున్నా తమకు ప్రోత్సాహం అందించడం లేదని అప్పడాల తయారీదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము డ్వాక్రా గ్రూపుల్లో ఉండడంతో, లింకేజి రుణాలు తప్ప ఇతర రుణాలు మంజూరు చేయడం లేదని వాపోతున్నారు. తమకు యాంత్రీకరణ సౌకర్యం కల్పించాలని, రాయితీపై ప్రత్యేక రుణాలు అందచేయాలని కోరుతున్నారు.

రుణాలిస్తే మరింత అభివృద్ధి..

ప్రస్తుతం స్వయం శక్తి సంఘాల ద్వారా మాకు రుణం అందిస్తున్నారు. ఇవి మా వ్యాపారాలకు సరిపోవడం లేదు. పైగా వడ్డీ భారం కూడా ఎక్కువగా ఉంటుంది. గ్రూపులో ఎవరూ కట్టకపోయినా ఆ భారం అందరిపై పడుతుంది. అలాకాకుండా అప్పడాల తయారీదారులందరికీ వ్యక్తిగత రుణాలు రాయితీపై అందిస్తే మరింత అభివృద్ధే చెందే అవకాశం ఉంది.

-గుడ్ల సన్యాసమ్మ, అప్పడాల తయారీదారు

యంత్రాలు అందించాలి..



ప్రస్తుతం అప్పడాల తయారీకి లేబర్ సమస్య వేధిస్తోంది. గతంలో రోజు కూలికి వచ్చేవారు. ఇప్పుడు కేజీ అప్పడాల ముద్దకు రూ.25 వరకు అడుగుతున్నారు. పెట్టుబడి, ఖర్చులు తీసివేస్తే మాకు గిట్టుబాటు కష్టంగా ఉంది. ప్రభుత్వం రాయితీపై అప్పడాలు తయారు చేసే యంత్రాలు అందించాలి.

-వి.గోవిందరావు, అప్పడాల తయారీదారుడు

- రాజాం-దోలపేట మధ్య తగ్గనున్న రద్దీ
- తక్కువ ఖర్చు.. ఎక్కువ ప్రయోజనం
- విద్యార్థులు, రోగులకు ఎంతో ప్రయోజనం

విస్తరిస్తే మేలు



ఈ గట్టును అభివృద్ధి చేస్తే వందలాది మందికి ప్రయోజనం

రాజాం రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి)

మున్సిపాలిటీ పరిధిలోని రాజాం-డోలపేట మధ్య కిలోమీటరు పొడవున్న మల్లమ్మచెరువు, గుర్రమ్మ చెరువు గట్టును అభివృద్ధి చేస్తే ఈ రెండు పట్టణాల మధ్య రాకపోకలకు మార్గం సుగమం అవుతుంది. ఇదే సమయంలో ట్రాఫిక్ కష్టాలకు తెరపడుతుంది. ఏడు మండలాల నుంచి ద్విచక్ర వాహనాలపై రాజాం పట్టణంలోకి వచ్చిపోయే వందలాది మందికి ఇక్కట్లు తొలగిపోతాయి. రెండు దశాబ్దాల క్రితం వరకూ చెరువుగట్టు మీదుగా రాజాం - డోలపేట మధ్య రాకపోకలు సాగించేవారు. అయితే నీటి పారుదల శాఖ అనుమతితో గుర్రమ్మ చెరువులో కొంత భాగాన్ని కప్పి బస్టాండ్ నిర్మాణం చేపట్టడం, ఇదే సమయంలో రాజాం-పాలకొండ మధ్య రహదారి విస్తరణ జరగడంతో చెరువుగట్టు మీదుగా రాకపోకలకు బ్రేక్ పడింది. రాజాం-డోలపేట మధ్య దశాబ్దకాలంగా వ్యాపార సముదాయాలు, షాపింగ్ మాల్స్, థియేటర్స్‌తో పాటు డోలపేటలో విద్యాసంస్థలు ఏర్పాటు కావడంతో రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. ఇదిలా ఉంటే రాజాంలో రెండోవిడత విస్తరణలో భాగంగా మూడేళ్ల క్రితం రాజాం-డోలపేట మధ్య పనులు ప్రారంభించిన వైసీపీ ప్రభుత్వం సకాలంలో కాంట్రాక్టర్‌కు నిధులు విడుదల చేయలేదు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కిలోమీటరు పొడవున్న చెరువుగట్టును అభివృద్ధి చేస్తే వందలాది మంది ట్రాఫిక్ జాంలో చిక్కుకోకుండా రాకపోకలు సాగిందేందుకు వెసులుబాటు కలుగుతుంది.

ప్రయోజనం ఇలా..

డోలపేటలోని జీఎంఆర్ నగర్‌లో ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థలు, కేర్ హాస్పిటల్, నైర్డ్ శిక్షణ సంస్థ, సాంకేతిక విద్యాసంస్థలున్నాయి. నిత్యం రెండువేల మంది వరకు విద్యార్థులు ఆయా విద్యా సంస్థలకు రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే కేర్ హాస్పిటల్‌కు రోగులు, వారి సహాయకులు, వైద్యులు, వైద్య సిబ్బంది.. నిత్యం హీనపక్షంగా వెయ్యిమంది వెళ్లి వచ్చే పరిస్థితి. వీటితో పాటు రాజాం మండలంలోని 15 గ్రామాలతో పాటు రేగిడి, వంగర, సంతకవిటి, పాలకొండ తదితర ప్రాంతాలకు చెందిన వారంతా రాకపోకలు సాగించే ఉద్యోగులు, వ్యాపారులు, ఇతరత్రా.. సుమారు రెండువేల మంది ఉంటారు. ఈ చెరువుగట్టును అభివృద్ధి చేస్తే ఈమార్గంలోనే రాకపోకలు సాగించేందుకు వీలవుతుంది. గతంలో గుర్రమ్మ, మల్లమ్మ చెరువుల్లోని కొంతభాగాన్ని మట్టితో కప్పివేసిన స్థలంలోనే ప్రస్తుతం ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణం జరపడంతో వచ్చిపోయే ప్రయాణికులకు సైతం వెసులుబాటు కలుగుతుంది.



రాజాం-డోలపేట మధ్య నిలిచిపోయిన ట్రాఫిక్ (ఫైల్)

గతంలో..

రెండు దశాబ్దాల క్రితం వరకూ డోలపేట పరిసర గ్రామాలకు చెందిన వారికి చెరువుగట్టే ప్రధాన మార్గంగా ఉండేది. సైకిళ్లు, ద్విచక్ర వాహనదారులతో పాటు పాదచారులు సైతం ఈ మార్గంలోనే వచ్చిపోయేవారు. విద్య, వైద్యం, బ్యాంకింగ్, వ్యాపార లావాదేవీల కోసం చెరువుగట్టు మీదుగానే వచ్చేవారు. అయితే ఈ రెండు చెరువుల్లో ఒకటి రాజాం మేజర్ పంచాయతీ పరిధిలోనిది కాగా మరొకటి సారథి మేజర్ పంచాయతీ పరిధిలో ఉండేవి. ఇలాంటి పరిస్థితుల్లో చెరువును కప్పివేసి బస్టాండ్‌తో పాటు రెండు మేజర్ పంచాయతీలు షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణం చేపట్టాయి. కాలక్రమంలో బస్టాండ్ ప్రాంతం మినహా చెరువుగట్లలో కొంతభాగం కాల్వ నిర్మాణం జరపగా మరికొంత భాగం ఆక్రమణలకు గురైంది. చిన్నపాటి ఆక్రమణలు తొలగించి 20 అడుగులు వెడల్పు ఉన్న చెరువుగట్టును అభివృద్ధి చేయాల్సి ఉంది.

ఎమ్మెల్యేపైనే ఆశలు..

ఈ ప్రాంతీయులు రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్‌పైనే గంపెడాశలు పెట్టుకున్నారు. గతంలో ఆయన హయాంలో నియోజక వర్గంలో సుమారు రూ.500 కోట్లతో అభి వృద్ధి పనులు చేపట్టడం, కూటమి అధికారంలోకి వచ్చిన 3 నెలల్లో నే నిలిచిపోయిన రాజాం-డోలపేట రహదారి పనుల కోసం రూ.9 కోట్లు మంజూరు చేయించడం, కాంట్రాక్టర్‌కు గత ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.6 కోట్ల బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకున్న నేపథ్యంలో చెరువుగట్టు అభివృద్ధిపై దృష్టిని కేంద్రీకరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఎరువుల దుకాణాలపై విజి‘లెన్స్’



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

విజయనగరం డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విజిలెన్స్ డీజీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాల మేరకు విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఆ శాఖ అధికారులు శుక్రవారం ఎరువుల దుకాణాలపై దాడులు నిర్వహించారు. జిల్లాలోని చీపురుపల్లి మండలం కర్లాం గ్రామంలో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. సరుకుల్లో వ్యత్యాసాలు, కాలం చెల్లిన పురుగులు మందులు వంటి, అవతవకులు గుర్తించారు. అలాగే శ్రీకాకుళం జిల్లా లావేరు మండలంలో పలు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఆయా దుకాణాల్లో రూ.9.6లక్షల విలువైన 70 మెట్రిక్ టన్నులకు పైగా ఎరువులను సీజ్‌చేసి 6(ఎ) కేసులు నమోదు చేశారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా పురుగుల మందులు అమ్మకాలు చేపడుతున్నట్టు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. ఈసందర్భంగా విజిలెన్స్ ఏస్పీ డి.ప్రసాద్‌రావు మాట్లాడుతూ ఎరువుల అక్రమ వ్యాపారంపై నిఘా ఉంచామని తనిఖీల్లో పట్టుబడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అధికారులు, ఎంఏవోలు పాల్గొన్నారు.

ఆ ఆవు మాంసం ఏమైంది?

- పోలీసులు పట్టుకున్నా చర్యలు శూన్యం

కొత్తవలస, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కొత్తవలస జంక్షన్ సమీపంలోని ఓ బిర్యాని సెంటర్‌లో ఆవు మాంసం ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దీంతో శుక్రవారం పోలీసులు దాడిచేసి 60 కేజీల ఆవు మాంసం స్వాధీనం చేసుకున్నారు. కానీ, నిర్వాహకుడిపై ఎటువంటి చర్యలు లేకుండానే వదిలి పెట్టారు. స్వాధీనం చేసుకున్న మాంసాన్ని ఏమి చేశారో తెలియడం లేదు. గొయ్యి తీసి పూడ్చిపెట్టినట్లు చెబుతున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు కొత్తవలసలోని బిర్యాని కేంద్రాలపై దాడులు చేస్తే అనలు విషయాలు బయట పడతాయని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై స్థానిక ఎస్ఐ సుదర్శన్‌ను వివరణ కోరగా..' బిర్యానీ సెంటర్ నిర్వాహకుడిపై కేసు పెడితే ఖర్చుతో కూడుకున్న పని. మాంసాన్ని ల్యాబ్‌కు పంపించాలంటే వేల రూపాయల ఖర్చు అవుతుంది. ఆహార కల్తీ నియంత్రణాధికారికి తెలియజేస్తాం. ఈ వ్యవహారాన్ని సీఐ చూస్తున్నారు. ఆయన్ని అడగాలి' అని తెలిపారు. కొత్తవలస సీఐను వివరణ కోరడానికి స్టేషన్‌కు వెళ్లగా అందుబాటులో లేరు. ఫోన్‌లో సంప్రదించినా లిఫ్ట చేయలేదు.



శ్రీరాముడు చిత్ర పటాన్ని బల్ల రిక్షాపై తిప్పుతూ ధర్మ ప్రచారం చేస్తున్న హరిదాసు

ధర్మ ప్రచారంలో హరిదాసు

- ఊరూరా తిరుగుతూ హరినామ గానం

బొబ్బిలి రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చేతిలో చిడతలు, కాలికి గజ్జెలు, పట్టు ధోవతి పంచెకట్టు, పట్టు కండువా నడుముకు కట్టి, మెడలో పూల హారం ధరించి, శ్రీరాములు వారి ఫొటో బల్ల రిక్షాపై ఊరేగిస్తూ హిందూ ధర్మ ప్రచారం చేస్తున్న హరిదాసు శుక్రవారం మల్లంపేటలో దర్శనమిచ్చారు. అతని పేరు కందుల నూకరాజు, అనకాపల్లి వాస్తవ్యుడు. గత 15 సంవత్సరాల నుంచి శ్రీరాముడి చిత్ర పటాన్ని బల్ల రిక్షాపై ఉంచి ఊరూరా తిరుగుతూ హిందూ ధర్మ ప్రచారం చేస్తున్నారు. ధనుర్మాసం మొదలైన సందర్భంగా ఇలా ఊరూరా తిరుగుతూ హరినామాన్ని గానం చేస్తూ స్వయం పాకానికి అందరూ ఇచ్చే ధన, ధాన్య, వస్తు దానాలను స్వీకరిస్తామని తెలిపారు.

- పండుగలప్పుడు ముఖ్యంగా సంక్రాంతికి వీరికి విశేష ప్రాముఖ్యత ఉన్నది. హిందువుల నమ్మకం ప్రకారం హరిదాసు అనగా పరమాత్మతో సమానం. మనుషులు ఇచ్చే దానధర్మాలు అందుకుని వారికి ఆయురారోగ్యాలు భోగ భాగ్యాలు కలగాలని దీవించేవారు హరిదాసులు.

తేలనున్న పశువుల లెక్క



- జిల్లాలో చురుగ్గా పశుగణన
- వైసీపీ ప్రభుత్వ పాలనలో అస్తవ్యస్తం
- పశుగణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు

రాజాం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి)

జిల్లా వ్యాప్తంగా పశుగణన చురుగ్గా జరుగుతోంది. అది కొలిక్కి వచ్చాక పశుగణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. జిల్లా వ్యాప్తంగా 2019 నాటికి 50,18,770 పశువులు ఉండేవి. ప్రస్తుతం జరుగుతున్న గణనలో వాటి సంఖ్య తగ్గముఖం పట్టినట్లు తెలుస్తోంది. పాడి పశువుల సంఖ్య పెరగగా, వ్యవసాయ పనుల్లో వినియోగించే పశువుల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పట్టినట్లు తెలుస్తోంది. కబేళాలకు తరలిపోవడం, సాగులో యాంత్రీకరణ పెరగడంతో పశువులు తగ్గుముఖం పట్టడానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. మరికొద్దిరోజుల్లో పశుగణన పూర్తికానుంది. దీనిపై ఒక స్పష్టత రానుంది.

పట్టించుకోని గత సర్కారు..

వైసీపీ ప్రభుత్వంలో పశు వైద్య వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఉమ్మడి జిల్లాలో 58 గ్రామీణ పశువైద్యశాలలు ఉన్నాయి. దాదాపు అన్ని మండలాల్లో వీటిని ఏర్పాటు చేశారు. పార్వతీపురం మండలంలో అధికంగా 4 ఉన్నాయి. జామి, మెంటాడ, బొండపల్లి, డెంకాడ, బొబ్బిలి మండలాల్లో మూడు ఆస్పత్రుల చొప్పున ఉన్నాయి. అయితే, వైసీపీ ప్రభుత్వం వాటిని తగ్గించే ప్రయత్నం చేసింది. మండలానికి ఒకటి, రెండు చొప్పున తగ్గించాలని చూసింది. గత ఐదేళ్లు వసతులు మెరుగుపరచడం, మందులు అందుబాటులో తేవడం వంటివి మరిచిపోయింది. సీజన్ల వారికి వ్యాక్సినేషన్లు లేవు. వైద్య శిబిరాల జాడలేదు. ఫలితంగా పశువులు సంచలు, తదితర వ్యాధుల బారినపడ్డాయి. అయినా జగన్ సర్కారు పట్టించుకోలేదు. సచివాలయాల్లో పశుసంవర్ధక శాఖ సహాయకులు ఉన్నా వీరి సేవలు అక్కరకు రాకుండా పోయాయి. అలాగే, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఆవులు కొనుగోలు చేసి ఇవ్వనున్నట్టు ప్రకటించింది. రాయితీతో పశుదాణ అందించనున్నట్టు చెప్పింది. అంతటితో ఆగకుండా పశువైద్యాన్ని మరింత మెరుగుగా అందించనున్నట్టు ఆర్భాటంగా ప్రకటించింది. ఇందుకుగాను నియోజకవర్గానికి ఒక అంబులెన్స్ ఇవ్వడంతో పాటు వైద్య పరీక్షల కోసం ల్యాబ్‌ను అందుబాటులో తేనున్నట్టు చెప్పింది. కానీ అవేవీ కార్యరూపం దాల్చలేదు. దేశీయ పశువుల విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకున్నా జెర్సీ, ఒంగోలు వంటి ఆవులు గర్భధారణ సమయంలో మాతాశిశు మరణాలు సంభవిస్తుంటాయి. అటువంటి సమయంలో పశువైద్యం సకాలంలో అందితే ఆవుతో పాటు దూడల ప్రాణాలను కాపాడుకోవచ్చు. అయితే పశుగణన లెక్క తేలాక.. అందుకు అనుగుణంగా పశుగణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అడుగులు వేయనుంది.

మెరుగైన సేవలు..

పశువైద్యం మరింత మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అందులో భాగంగానే పశుగణన చురుగ్గా జరుగుతోంది. సమగ్ర వివరాలు సేకరిస్తోంది. సిబ్బంది కొరత ఉన్నా పాడిరైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సేవలందిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో మరింత మెరుగైన సేవలందిస్తాం

-వైవీ రమణ, పశుసంవర్థక శాఖ జేడీ, విజయనగరం

అమెజాన్ వెబ్ సర్వీస్‌లో ఉద్యోగావకాశాలు

శ్రీకాకుళం రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): టెక్ మహేంద్ర ఫౌండేషన్ వారి డిజిటల్ అకాడమీలో అమెజాన్ వెబ్ సర్వీస్ ప్రోగ్రాంలో ఉచిత శిక్షణ, సర్టిఫికేషన్, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్టు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణకు బీఈ, బీటెక్, బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. వివరాలకు 7680945357, 79950 13422 సంప్రదించాలన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

గజపతినగరం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక జుడీషియల్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం లోక్ అదాలత్ నిర్వహిస్తామని న్యాయాధికారిణి బి.కనకలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించేలా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. ● కొత్తవలస: కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం ఉదయం 10 గంటల నుంచి మెగా లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్టు న్యాయవాద సంఘం అధ్యక్షురాలు డీవీఎల్ దేవి తెలిపారు. న్యాయాధికారి ఎస్.విజయచందర్ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. న్యాయవాద సంఘం ఆధ్వర్యంలో భోజన ఏర్పాట్లు కూడా చేస్తున్నట్టు తెలిపారు.

17న ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా

రాజాం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 17వ తేదీన ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తామని ఐటీఐ ప్రిన్సిపాల్ బండారు భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ డిప్లొమా, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించి 18 నుంచి 35 ఏళ్ల మధ్య ఉన్నటువంటి యువతీ యువకులకు అవకాశం ఉంటుందన్నారు. ఉదయం 9 గంటలకు అన్ని ధ్రువపత్రాలతో హాజరు కావాలని ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి జి.ప్రశాంతికుమార్, బి.భాస్కరరావు కోరారు. పూర్తి వివరాలకు 7286042743, 9988853335 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

జీఎంఆర్ ఐటీ విద్యార్థుల ప్రతిభ

రాజాం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం బెల్గాంలో ఈనెల 11, 12 తేదీల్లో జరిగిన అఖిల భారత సాంకేతిక విద్యా మండలి ఏఐసీటీఈ స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2024 పోటీల్లో జీఎంఆర్ ఐటీ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ జట్టులో బి.మౌర్య, వి.తేజ, వర్షిత్, ఎ.ప్రవల్లిక, బి.సుప్రజ, ఎం.విజయ్, సీహెచ్ జగదీష్‌తో పాటు సహాయకుడిగా కె.అరవింద్ పాల్గొన్నారు. విజేతలను జీఎంఆర్ ఐటీ విభాగ సంచాలకుడు జె.గిరీష్, ప్రిన్సిపాల్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్, విభాగాధిపతులు అట్టాడ వెంకటరమణ, వసుధరాణీ, శ్రీవిద్య అభినందించారు.

పాడి పరిశ్రమ మంత్రిత్వ శాఖ సమావేశంలో కలిశెట్టి

రాజాం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ హాల్-1లో శుక్రవారం జరిగిన మత్స్య పశు సంవర్థక పాడి పరిశ్రమ మంత్రిత్వ శాఖ సంప్రదింపుల కమిటీ సమావేశంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు. ఈ విషయాన్ని ఆయన ఇక్కడి విలేకర్లకు శుక్రవారం తెలిపారు. సమావేశంలో చర్చించిన విషయాలను ఆయన మత్స్యశాఖ సంప్రదింపుల కమిటీ దృష్టికి తీసుకువెళ్లినట్టు చెప్పారు.

ఇసుక లారీల పట్టివేత

భోగాపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): అధిక లోడుతో వెళ్తున్న మూడు ఇసుక లారీలను ఏడీ మైన్స్ అధికారి బి.అశోక్‌కుమార్ పట్టుకుని శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు అధిక లోడుతో వెళ్తున్న మూడు ఇసుక లారీలను భోగాపురం జాతీయ రహదారిపై పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. ఈ లారీలకు అపరాధ రుసుం విధిస్తామని పోలీసులు తెలిపారు.

డిజిటల్ సమ్మిట్ బ్రోచర్ విడుదల

భోగాపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ముంజేరు సమీప మిరాకిల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఈనెల 19నుంచి డిజిటల్ సమ్మిట్-2024 నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం మిరాకిల్ సంస్థలో ఆమె బ్రోచర్‌ను విడుదల చేశారు. సీఈవో లోకం ప్రసాదు పాల్గొన్నారు.

సబ్ పోస్టాఫీస్ తనిఖీ

నెల్లిమర్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్లలోని సబ్ పోస్టాఫీస్‌ను జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ కొల్లూరు శ్రీనివాస్ శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పీఎల్ఐ, ఆర్‌పీఎల్ఐ బీమా పోలసీలపై ఆరా తీశారు. సబ్ పోస్టుమాస్టర్ జి.యర్రయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంధన పొదుపు వారోత్సవాలు

విజయనగరం రింగురోడ్డు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకూ జిల్లాలో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీరు మువ్వల లక్ష్మణరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ వారోత్సవాల్లో భాగంగా జిల్లా ప్రధాన కేంద్రం, డివిజన్ కేంద్రాల్లో అవగాహన ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు. పాఠశాలల విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి, 20న ముగింపు వారోత్సవాల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు.

సమస్యల పరిష్కారానికే సదస్సులు

గరివిడి, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలు పరిష్కరించడానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. మందిరివలస గ్రామంలో తహసీల్దార్ బంగారురాజు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని, మాట్లాడారు. టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కాలువలు ఉన్నా రోడ్డుపైనే మురుగు

- ఏళ్ల తరబడి కొనసాగుతున్న సమస్య
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ముంజేరు వాసులు


కాలువలో స్తంభించిన మురుగు

భోగాపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాలువల్లో ప్రవహించాల్సిన మురుగు రహదారిపైకి పొంగి పొర్లుతోంది. వాహనచోదకులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య ఏళ్ల తరబడి కొనసాగుతున్నా.. ప్రభుత్వాలు మారుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. ముంజేరు గ్రామంలో గత రెండేళ్లగా మురుగునీటి సమస్య వెంటాడుతోంది. అక్కడ కాలువలు ఉన్నా మురుగు మాత్రం రోడ్డుపైనే ప్రవహిస్తుంది. కాలువ ద్వారా మురుగు ప్రవహించే అవకాశం లేకపోవడంతో రోడ్డుపైకి వచ్చేస్తుంది. అలాగే కాలువల్లో రోజుల తరబడి మురుగు నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఎమ్మెల్యే లోకం నాగమాధవి నిత్యం ఇదే దారిలో రాకపోకలు సాగిస్తున్నా కనీసం పట్టించుకోవడం లేదని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ సిద్ధార్థ కాలనీవాసులు, ముంజేరు గ్రామస్థులు గత కొంతకాలంగా మురుగు కాలువ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మురుగునీరు కాలువల్లో ప్రవహించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు ముక్తకంఠంతో కోరుతున్నారు.


ముంజేరులో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

ఆరు నెలల్లో చేసిందేమిటి?

- వైసీపీ నాయకుల నిరసన

విజయనగరం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలల్లో రైతులకు చేసిందేమిటని వైసీపీ నాయకులు ప్రశ్నించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆ పార్టీ నాయకులు 'అన్నదాతకు అండగా వైసీపీ' అనే నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా కంటోన్మెంట్ నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాల నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం జేసీ సేతుమాధవన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆరు నెలల్లో కూటమి ప్రభుత్వం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయాలని, ధాన్యం కొనుగోలులో కూటమి ప్రభుత్వం దళారీ వ్యవస్థను బలోపేతం చేసేటట్టుగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఉచిత పంటలకు బీమా ఇవ్వాలని, రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యేలు శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, బొత్స అప్పలనర్సయ్య, కడుబండి శ్రీనివాసరావు, బడ్డుకొండ అప్పలనాయుడు, తలే రాజేష్, మాజీ జడ్పీ అధ్యక్షురాలు శోభాస్వాతీరాణితో పాటు జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద వైసీపీ నాయకుల నిరసన ప్రదర్శన

పునరావాసం కల్పించండి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు

లక్కవరపుకోట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): విశాఖ-రాయ్‌పూర్ జాతీయ రహదారి 130-సీడీ నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన వారికి పునరావాసం కల్పించాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారికి శుక్రవారం గాంధీనగర్ వాసులు ఆమె నివాసం వద్ద వినతిపత్రం అందజేశారు. జాతీయ రహదారుల నిర్మాణం ఇంటర్ చేంజ్ రింగ్‌రోడ్డు ఏర్పాటులో భాగంగా సుమారు 20 కుటుంబాలు రోడ్డున పడ్డాయని, తమను ఆదుకోవాలని కోరారు. కొత్తవలస మండలం ఉత్తరావల్లి రెవెన్యూలో ఇళ్ల స్థలాలు ఏర్పాటు చేసి పునరావాసం కల్పించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ భూములు కోల్పోయిన వారిపై విచారణ జరిపి, తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గాడి అప్పారావు, తాతబాబు, రాజు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధికి సహకరించండి

లక్కవరపుకోట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని అధికార యంత్రాంగమంతా గ్రామాల సుస్థిర అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కోరారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సుస్థిర అభివృద్ధి శిక్షణలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి అన్ని శాఖాధికారులు సమగ్ర ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. మాజీ జడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, ఎంపీడీవో అప్పారావు, పీహెచ్‌సీ వైద్యులు అనిల్‌కుమార్, ఈవోపీఆర్‌డీ పాల్గొన్నారు.

సందేహాలు నివృత్తి చేసేందుకే ఓపెన్ ఫోరం

విజయనగరం రింగురోడ్డు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రణాళిక విభాగ పరంగా ప్రజల నుంచి వచ్చిన సందేహాలను, సమస్యలను నివృత్తి చేయడమే టౌన్ ప్లానింగు ఓపెన్ ఫోరం ముఖ్య ఉద్దేశ్యమని అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రణాళికా కార్యదర్శులు, లైసెన్సుడ్ టెక్నికల్ పర్సన్లు, బిల్డర్లు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం టౌన్ ప్లానింగు ఓపెన్‌ఫోరం కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహిస్తామని తెలిపారు. నగరంలో ప్రజలకు పట్టణ ప్రణాళికా విభాగం ద్వారా నివృత్తి కావల్సిన సమస్యలు, సందేహాలను ఓపెన్ ఫోరం ద్వారా విశదపరుస్తామని చెప్పారు. టీపీవో అప్పల రాజు, టీపీఎస్ అనిత పాల్గొన్నారు.

17న ఏక సభ్య కమిషన్ పర్యటన

విజయనగరం టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణ, ఉపకులాలపై విచారించేందుకు ఈనెల 17న ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్ సభ్యుడు, విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా పర్యటించనున్నారని సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు బి.రామానందం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలోని షెడ్యూల్ కుల సంఘాలు, ఎస్సీ నాయకుల నుంచి రంజన్ మిశ్రా వినతులు స్వీకరిస్తారని చెప్పారు.

రేపు జూనియర్ కబడ్డీ పోటీల ఎంపిక

విజయనగరం టౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి బాల బాలికల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే జిల్లా కబడ్డీ జట్టు ఎంపికలు ఈనెల 15న నిర్వహిస్తామని జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఛైర్మన్ ఐవీపీ రాజు, అధ్యక్ష, కార్యదర్శులు రంగారావు, ప్రభావతిలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రాష్ట్ర స్థాయి పోటీలు ఈనెల 22 నుంచి 25 వరకు తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. నగరంలోని రాజీవ్ క్రీడా మైదానంలో ఆదివారం ఉదయం 9 గంటలకు ఎంపిక పోటీలు నిర్వహిస్తామని వారు తెలిపారు. బాలుర విభాగంలో 70 కేజీల లోపు, బాలికల విభాగంలో 65 కేజీల లోపు బరువు కలిగి ఉండాలన్నారు. వివరాలకు 9949721949 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

సారా తయారీ కేంద్రంపై దాడి

విజయనగరం క్రైం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కొత్తవలస మండలం ముషిరాం గ్రామ శివారులో సారా తయారీ కేంద్రంపై దాడి చేసి, 1400 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేసినట్టు ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంటు సీఐ కె.ఇందిరాదేవి శుక్రవారం తెలిపారు. సారా తయారీ కేంద్రంపై దాడి చేసి, సామగ్రిని స్వాధీనం చేసుకుని తదుపరి చర్యలు నిమిత్తం ప్రొహిబిషన్ ఎక్సైజ్ కొత్తవలస స్టేషన్‌కు అప్పగించామని చెప్పారు. ఈ దాడుల్లో హెచ్‌సీ రాంబాబు, కానిస్టేబుల్స్ రాము, మనోజ్ పాల్గొన్నారు.

పాడి పశువుల పెంపకంతో అభివృద్ధి

- ఎమ్మెల్యే నాగమాధవి

డెంకాడ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రైతులు పాడి పశువుల పెంపకంతో అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. గంట్లాం గ్రామంలో శుక్రవారం పశు సంవర్థకశాఖ, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్తంగా రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం, లేగ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఏపీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్‌రావు, తదితరులు పాల్గొన్నారు. ఈ శిబిరంలో 51 పశువులకు చికిత్సలు అందించి, మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యమైన దూడలను గుర్తించి, యజమానులకు బహుమతులు అందజేశారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగమాధవి

ఉనికి కోసమే వైసీపీ ఉద్యమాలు

- చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకటరావు

చీపురుపల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తమ పార్టీ ఉనికిని కాపాడుకోడానికే వైసీపీ ఉద్యమాలు, ధర్నాలు చేస్తోందని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు ఎద్దేవా చేశారు. చీపురుపల్లిలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్ల కాలంలో రైతులను అన్ని రకాలుగా ఇబ్బందులు పెట్టారన్నారు. నియోజకవర్గంలో సుమారు 52 వేల ఎకరాలకు సాగు నీరందించే తోటపల్లి కాలువల కోసం ఒక్క పైసా కూడా విదల్చ లేదన్నారు. అధికారంలో కోల్పోయాక ఏం చేయాలో తోచక ఆ పార్టీ నాయకులు ధర్నాలు చేస్తున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు రౌతు కామునాయుడు, కెల్ల రామారావు, కరణం మురళి, పైల బలరాం, సారేపాక సురేష్, బలగం వెంకటరావు, రెడ్డి గోవింద్, మండల చంటి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

మెడికల్ కళాశాల ప్రాంగణంలోకి తరలించాలి

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రాసుపత్రిని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రాంగణంలోకి తరలించి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్వహించాలని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. శుక్రవారం ఆర్‌అండ్‌బీ సమీపంలోని తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత నెల 28, 29, 30 తేదీల్లో మూడు రోజులు కేంద్రాసుపత్రి రోగులు, రోగుల బంధువులను అధికారులను కలిసి నివేదికను తయారు చేశామని చెప్పారు. కేంద్రాసుపత్రిలో ఊహించని స్థాయిలో ఓపీ, ఐపీ పెరిగిందని, అదే స్థాయిలో మౌలిక సదుపాయాలు లేక రోగులు, రోగుల బంధువులు వైద్యులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణమే కేంద్రాసుపత్రిని మెడికల్ కళాశాల ప్రాంగణంలోకి మార్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో వేదిక ప్రతినిధులు రామచంద్రరాజు, రొంగలి పోతన్న, టి.మోహనరావు, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.


నివేదికను విడుదల చేస్తున్న భీశెట్టి బాబ్జీ

రాజకీయ కక్షలు తగవు

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 13: (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వలంటీర్లపై రాజకీయ కక్షలు తగవని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గ్రామ, డివిజన్ సచివాలయ వలంటీర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం డీటీ స్వర్ణకుమార్ వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వలంటీర్లకు వేతనాలు పెంచుతామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. తక్షణమే వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని, న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న వలంటీర్ల అసోసియేషన్ ప్రతినిధులు

స్వర్ణాంధ్ర సాధనలో భాగస్వాములు కావాలి

విజయనగరం, కలెక్టరేట్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జేసీ సేతు మాధవన్ పిలుపునిచ్చారు. విజయ వాడలో శుక్రవారం స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ ను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేట్‌లో ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఈ కార్యక్రమాన్ని జేసీతో పాటు డీఆర్వో శ్రీనివాస మూర్తి, జిల్లా అధికారులు వీక్షించారు. స్వర్ణాంధ్ర సాధనలో ప్రతి ఒక్కరం భాగస్వాములం అవుతామని జేసీ ప్రతిజ్ఞ చేయించారు.

ఎన్నికలకు సహకరించాలి

నెల్లిమర్ల, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘం ఎన్నికల నిర్వహణకు ఓటర్లు సహకరించాలని కొత్తపేట వెదుళ్ల చెరువు సాగు నీటి సంఘం ఎన్నికల అధికారి, డీటీ వీవీఆర్ జగన్నాథరావు సూచించారు. శనివారం సాగునీటి సంఘం ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో శుక్రవారం కొత్తపేటలో ఆయన సమావేశం నిర్వహించారు. వెలుగు ఏపీఎం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రూఆప్ చార్జీలు తగవు

విజయనగరం దాసన్నపేట, డిసెంబరు 13: (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సర్దుబాటు చార్జీల విధానం తక్షణమే నిలిపివేయాలని, స్మార్ట్ మీటర్లు పెట్టవద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు కోట వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ట్రూఆప్ చార్జీల పెంపు ఉపసంహరించుకునే వరకూ ఉద్యమిస్తామన్నారు. ఈనెల 17న విద్యుత్ భవనం వద్ద బిల్లులు రద్దు చేయాలని కోరుతూ నిరసన తెలియజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ప్రతినిధులు రమణమ్మ, రమణ, రామచంద్రరావు, శ్రీనివాసరావు, ఆనంద్, శాంత మూర్తి, తదితరులు పాల్గొన్నారు.


కోట జంక్షన్ వద్ద నిరసన తెలియజేస్తున్న సీపీఎం ప్రతినిధులు

కాపు కాసి.. దర్జాగా ఇంట్లోకి వెళ్లి

- 13 తులాల బంగారం చోరీ

రాజాం రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఈశ్వరనారాయణ కాలనీలోని రెండో లైన్‌లో ఉంటున్న సత్యనారాయణ ఇంట్లో శుక్రవారం 13 తులాల బంగారం చోరీకి గురయ్యింది. ఎస్ఐ రవికిరణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈశ్వరనారాయణ కాలనీ రెండో లైన్‌లో ఉంటున్న సత్యనారాయణకు పట్టణంలోని బజార్‌రోడ్‌లో కిరాణా దుకాణం ఉంది. శుక్రవారం మధ్యాహ్నం భోజనం అనంతరం సత్యనారాయణ భార్య ఇంటికి తాళం వేసి, చెప్పుల స్టాండ్‌లో ఇంటితాళం పెట్టి షాపు వద్దకు వెళ్లింది. ఇది గమనించిన గుర్తు తెలియని వ్యక్తి దర్జాగా చెప్పుల స్టాండ్‌లోని తాళం తీసి, ఇంట్లోకి వెళ్లి తాళాలతో బీరువా తెరిచి బంగారు ఆభరణాలున్న బాక్సును ఎత్తుకెళ్లాడు. సాయంత్రం షాపు నుంచి ఇంటికి వచ్చిన సత్యనారాయణ భార్య.. ఇంటి తలుపులతో పాటు బీరువా తెరిచి ఉండడాన్ని చూసింది. బీరువాలో నగలు బాక్సు కనిపించకపోవడాన్ని గుర్తించింది. సత్యనారాయణ అందజేసిన ఫిర్యాదు మేరకు రాజాం రూరల్ సీఐ ఉపేంద్రరావు, ఎస్ఐ రవికిరణ్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ సభ్యుడే కాజేశాడు

- 7 తులాల బంగారం అపహరణ
- కొద్దిగంటల్లో రికవరీ

రేగిడి, డిసెంబరు 13,(ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యుడే ఏడు తులాల బంగారం కాజేసిన వైనం రేగిడి మండలం ఉంగరాడమెట్ట గ్రామంలో చోటుచేసుకుంది. చోరీ జరిగిన కొద్ది గంటల్లోనే క్లూస్‌టీం సహాయంతో స్థానిక పోలీసులు నిందితుడిని పట్టుకుని, బంగారాన్ని రికవరీ చేశారు. ఈ ఘటనపై ఎస్ఐ నీలావతి శుక్రవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉంగరాడమెట్ట గ్రామంలో నివాసం ఉంటున్న కరమి స్వామి ఇటీవల తన భార్యతో కలిసి చీరాల వలస వెళ్లారు. ప్రస్తుతం ఇంటి వద్ద పెద్ద కుమార్తె పావని ఉంటోంది. అయితే పావనీ చెల్లి నిండుగర్భిణీ కావడంతో డెలివరీ నిమిత్తం ఈనెల 10న రాజాం ఆస్పత్రిలో చేర్పించారు. దీంతో పావని ఇంటికి తాళం వేసి, ఆస్పత్రిలో తన చెల్లికి తోడుగా ఉంటోంది. దీన్ని గమనించిన రాజాం మండలం అంతకాపల్లికి చెందిన వీరి కుటుంబ సభ్యుడు, పావనీ భర్త రాంబాబు ఈనెల 11న అర్థరాత్రి ఇంట్లో చొరబడ్డాడు. పెట్టెలో ఉన్న ఏడు తులాల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయాడు. ఈనెల 12న ఆస్పత్రి నుంచి వచ్చిన పావని ఇంట్లోకి వెళ్లి చూడగా, వస్తువులన్నీ చిందర వందరగా పడి ఉన్నాయి. బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో అదే రోజు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం క్లూస్‌టీం వచ్చి పరిశీలించింది. క్లూస్ టీం సహాయంతో పోలీసులు కొద్ది గంటల్లోనే నిందితుడిని పట్టుకుని, చోరీ సొత్తును రికవరీ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు.

తహసీల్దార్ కార్యాలయంలో లైంగిక వేధింపులు?

బొబ్బిలి/బొబ్బిలి రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగి లైంగిక వేధింపులకు గురవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదే కార్యాలయంలో పని చేస్తున్న ఓ అధికారి మహిళా ఉద్యోగుల పట్ల అసభ్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని ఆమె స్థానిక అధికార పార్టీ నాయకుల ముందు చెప్పి ఆవేదన చెందినట్లు సమాచారం. లైంగిక వేధింపులకు పాల్పడుతున్న అధికారి నుంచి తనకు ఎటువంటి అపాయం జరగకుండా ఉండేందుకు బాధితురాలు నిత్యం తన బ్యాగులో ఓ కత్తి ఉంచుకుంటున్నట్లు తెలుస్తోంది. మహిళా ఉద్యోగులందరి పట్ల ఆయన అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తున్నారని, తన కోరిక తీర్చకపోతే ఇతరత్రా వేధింపులకు పాల్పడుతున్నాడని, అతడిని ఈ కార్యాలయం నుంచి దూరంగా బదిలీ చేయకపోతే ఇక్కడ పనిచేయడం చాలా కష్టమని బాధిత మహిళ వాపోతున్నట్టు తెలిసింది.

ఎటువంటి ఫిర్యాదు అందలేదు

మా కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులెవరి నుంచి లైంగిక వేధింపులపై ఎటువంటి ఫిర్యాదులు రాలేదు. ఓ అధికారి లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లుగా జరుగుతున్న ప్రచారంపై పూర్తి స్థాయిలో ఆరా తీశాను. అటువంటిదేమీ నిర్ధారణ కాలేదు. స్థానికంగాగల ఓ నాయకుడు ఆడియో రికార్డు చేసినట్లు తెలిసింది. దీంతో మాకు ఎటువంటి సంబంధం లేదు. ఎటువంటి ఆధారాలు లేకుండా నిందారోపణలు చేయడం సరికాదు.

- మలపురెడ్డి శ్రీను, తహసీల్దార్, బొబ్బిలి

వ్యక్తి మృతి

పార్వతీపురం రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావికోన పంచాయతీ పరిధిలో ఎం.నీలకంఠం(54) అనే వ్యక్తి మృతిచెందారు. ఈ వ్యక్తి మద్యం మత్తులో పడిపోయి చనిపోయినట్టు సమాచారం. దీనిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

మద్యం సీసాల స్వాధీనం

రాజాం రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని రాజాం పోలీసులు శుక్రవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 20 సీసాలను స్వాధీనం చేసుకున్నారు. బొద్దాం గ్రామానికి చెందిన రూపేష్ కుమార్ రాజాం నుంచి మద్యం తరలిస్తున్న విషయాన్ని తెలుసుకున్న ఏఎస్ఐ భాస్కర్రావు సిబ్బందితో వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ మాతామూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తహసీల్దార్ నిర్లక్ష్యంపై నిరసన

మక్కువ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నీటి సంఘాల ఎన్నికలో పోటీ చేసే రైతులంతా వీఆర్వోకు భూమి శిస్తు చెల్లించి రసీదులు పొందాలని శుక్రవారం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. అయితే తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో వారు నిరసనకు దిగారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు రైతులందరూ వేచి ఉన్నా తహసీల్దార్ రాలేదని, సమావేశాలు ఉన్నాయంటూ ఉద్దేశపూర్వకంగానే తప్పించుకున్నారని వైసీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, జనసేన పార్టీ మండల నాయకుడు పెంట తిరుపతిరావు అన్నారు. శిస్తు కట్టించుకొని రసీదులు ఇవ్వకుండా తమని ఎన్నికలో పాల్గొకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ షేక్ ఇబ్రహీంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి తహసీల్దార్‌పై ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.వెంకటరమణమూర్తి తెలిపారు.

వరిచేను కుప్పలు దగ్ధం

పాలకొండ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): యరకారాయపురం గ్రామ సమీపంలో శుక్రవారం సుమారు ఐదు ఎకరాల వరిచేను కుప్పలు అగ్నికి ఆహుతయ్యాయి. అందిన సమాచారం మేరకు పాలకొండ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, మంటలను అదుపు చేశారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు వరిచేను కుప్పలకు నిప్పుపెట్టి ఉంటారని అగ్నిమాపక సిబ్బంది అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం పండించిన పంట చేతికి వచ్చే సమయంలో అగ్నికి ఆహుతి కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అన్నదాతలను ఆదుకోవాలి

● వైసీపీ నేతల డిమాండ్



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వైసీపీ శ్రేణులు

బెలగాం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అన్నదాతల సమస్యలను పరిష్కరించి.. వారిని ఆదుకోవాలని వైసీపీ నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా రైతులు, ప్రజలను ప్రభుత్వం మోసం చేస్తోందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజ్ అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్నదాతలకు రైతు భరోసా ఇచ్చి ఆదుకున్నా మని గుర్తు చేశారు. కూటమి సర్కారు అన్నదాత సుఖీభవ కింద ఇంకా రూ.20 వేలు ఇవ్వలేదని తెలిపారు. రైతుల, ప్రజా సమస్యలపై వైసీపీ ఎప్పుడూ పోరాడుతూనే ఉంటుందని చెప్పారు. అనంతరం జేసీ శోభికకు వినతి పత్రం ఇచ్చారు. ఈ నిరసనలో ఎంపీ తనూజా, మాజీ ఎమ్మెల్యేలు, మంత్రులు అలజంగి జోగారావు, వి.కళావతి, పుష్పశ్రీవాణి, రాజన్న దొర, ఎమ్మెల్సీ విక్రాంత్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాంకేతిక లోపాల వల్లే తాగునీటి సరఫరాకు ఆటంకం

పార్వతీపురం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు

పార్వతీపురం టౌన్, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ప్రధాన పంప్‌హౌస్ వద్ద సాంకేతిక లోపాలు తలెత్తడంతో మున్సి పాల్టీలోని 30వార్డులకు తాగునీటిని సరఫరా చేయలేక పోతున్నామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ.. నాగావళిలో ప్రవాహ ఉధృతి కారణంగా ప్రధాన పంప్‌హౌస్ వద్ద ఇన్‌ఫిల్టర్ బావుల చుట్టూ ఉన్న ఇసుక బస్తాలు కొట్టుకుపోయాయన్నారు. అందుకే తాగునీటి సరఫరా చేయలేకపోతున్నామని తెలిపారు. మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులను అప్రమత్తం చేశామన్నారు. అయితే తాగునీటి సరఫరా విభాగం కార్మికులు గత మూడు రోజులుగా సమ్మెలో ఉండడం వల్ల ఇబ్బందులు తప్పడం లేదని వెల్లడించారు. ఒకట్రెండు రోజుల్లో సమ స్యను పరిష్కరిస్తామని, ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయనున్నామని తెలిపారు.

గిరి ప్రదక్షిణకు తరలిరండి

గరుగుబిల్లి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం పరిధిలో నిర్వహిస్తున్న గిరి ప్రదక్షిణకు భక్తులు తరలిరావాలని ఆలయ అభివృద్ధి ప్రతినిధి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ మరడాన తవిటినాయుడు కోరారు. శుక్రవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ ఈ ప్రాంతంలో మొదటిసారిగా గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్గశిరమాస పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం సాయంత్రం 5 గంటలకు గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుందని తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టామన్నారు.

ఎల్విన్‌పేటలో సెమీ క్రిస్మస్ వేడుకలు

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎల్విన్‌పేట గ్రామంలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. పాస్టర్లు ఎం.శోభన్‌బాబు, డేవిడ్ కడియాల ఆధ్వర్యంలో ఒడిశా రాష్ట్రం బొలంగిరిక చెందిన ఫెయిత్ మిని స్ట్రీస్ నిర్వాహకులు ప్రేమ్ రవోలో కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ప్రార్థనలు చేశారు. అనంతరం 30 మంది పిల్లలకు స్వెట్టర్లు ఇచ్చారు. రాఫా ఫౌండేషన్ ప్రతినిధి పెంటయ్య తదితరులున్నారు.

పోలీసులకు దేహదారుఢ్య పరీక్షలు



మాక్‌డ్రిల్ చేస్తున్న ఏఆర్ పోలీసులు

పార్వతీపురంటౌన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్న ప్రత్యేక రిజర్వ్ పోలీసులకు శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ కె.థామస్ రెడ్డి పర్యవేక్షణలో డ్రిల్ నైపుణ్యం పై ప్రత్యేక తర్ఫీదు ఇచ్చారు. ఏఆర్ పోలీసులు ఇతర బలగాల వారికి ఆదర్శంగా నిలవాలన్నారు.

వంద రోజుల ప్రణాళికలు అమలు చేయండి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ

వీరఘట్టం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆర్‌జేడీ విజయభాస్కర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ.. టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు వంద రోజుల ప్రణాళికలను అమలు చేయాలని సూచించారు. విధిగా మధ్యాహ్న భోజనం పర్యవేక్షించాలని, పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందేలా చూడాలని తెలిపారు. అనంతరం వీరఘట్టం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్‌ఏ-1 పరీక్షలు పరిశీలించారు. పాఠశాల ప్రహరీ నిర్మాణానికి అంచనాలు పంపించాలన్నారు. పాలకొండ ఉప విద్యాశాఖాధికారి కృష్ణమూర్తి, ఎంఈవో ఆనందరావు, హెచ్‌ఎంలు ప్రమీల, సొంబారు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు బొడ్డవలస విద్యార్థి



జాతీయ పోటీలకు వెళ్తున్న మనోహర్, చెస్ ట్రోఫీతో వరుణ్

సాలూరు రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో బొడ్డవలస బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యార్థి నితిన్‌సాయి మనోహర్ పాల్గొంటున్నట్టు ప్రిన్సిపాల్ ఆశీర్వాదం,పీడీ విద్యాసాగర్ శుక్రవారం తెలిపారు. కశ్మీర్‌లో ఈ నెల 17 నుంచి 21 వరకు జాతీయస్థాయి పోటీలు నిర్వహించనున్నారన్నారు. ఇందులో పాల్గొనేందుకు నితిన్‌సాయి బయలుదేరాడన్నారు. అదేవిధంగా గురుకులాల రాష్ట్రస్థాయి పోటీల్లో చెస్‌లో తమ విద్యార్థి వరుణ్ ద్వితీయస్థానం సాధించినట్టు చెప్పారు. విద్యార్థులను గురుకులాల కోఆర్డినేటర్ ఫ్లోరెన్స్, పీఈటీ నాయుడు,ఉపాధ్యాయులు అభినందించారు.

మొక్కుబడిగా రహదారి పనులు



భామిని, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అలికాం-బత్తిలి రహదారి పనులు మొక్కుబడిగా సాగుతున్నాయి. దీంతో వాహనదారులు, స్థానికులు పెదవి విరుస్తున్నారు. వాస్తవంగా వారం రోజుల కిందట బత్తిలి వద్ద అక్కడక్కడా గుంతలను చదును చేశారు. శుక్రవారం సాయంత్రం మెటల్ డస్ట్ వేసి రోలింగ్ చేపట్టారు. ఈ విధంగా ప్యాచ్ వర్కులు చేయడం వల్ల ఎటువంటి ప్రయోజనం ఉండదని, కొద్దిరోజులకే రోడ్డు యథాస్థితికి చేరనుందని ఆ ప్రాంత వాసులు చెబుతున్నారు. వాస్తవంగా గత ప్రభుత్వ హయాంలో ఈ రహదారి మరమ్మతు పనులు చేపట్టారు. అయితే సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. ప్రస్తుతం వారికి సర్దిచెప్పి ఆర్‌అండ్‌బీ అధికారులు ప్యాచ్ వర్క్‌లు చేపడు తున్నట్టు తెలుస్తోంది. కాగా ఈ మార్గంలో కొరమ నుంచి ఘనసర వరకు పనులు మంజూరు కాలేదు. దీంతో ఇటువైపు ప్రయాణం వాహనదారులకు నరకంగా మారింది. కొరమ నుంచి ఘనసర ఏడు కిలోమీటర్లు, పసుకుడి నుంచి బిల్లుమడ మూడు కిలోమీటర్ల మేర రోడ్డు అడుగుకో గొయ్యితో అధ్వానంగా మారింది. మట్టిరోడ్డుగా దర్శనమిస్తుండగా.. నిత్యం ధూళి రేగుతుండడంతో గుణుపూర్, రాయగడ, గుమ్మలక్ష్మీపురం, చత్తీస్‌ఘడ్ వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ప్యాచ్ వర్కులకు అవకాశం లేదు. పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మించాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ ఏఈ కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా.. ప్రస్తుతానికి ప్యాచ్ వర్క్‌లు జరుగుతున్నాయన్నారు. అలికాం-బత్తిలి మార్గంలో రోడ్ల పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. టెండర్లు పూర్తయ్యాక నిర్మాణం చేపడతామని చెప్పారు.

బత్తిలి సమీపంలో గుంతలను పూడుస్తున్న దృశ్యం

ఉద్యోగ భద్రత కల్పించండి

● గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల డిమాండ్





కలెక్టరేట్, సీతంపేట ఐటీడీఏ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు

బెలగాం/సీతంపేట రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గిరిజన గురుకుల విద్యాలయాల్లో ఎన్నో ఏళ్లుగా బోధిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు కోరారు. శుక్రవారం కలెక్టరేట్ వద్ద రిలే దీక్ష చేపట్టారు. తమ పోస్టులను డీఎస్సీ నుంచి మినహా యించాలని, సీఆర్టీలుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలని నినాదాలు చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. తమ సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. సీతంపేట ఐటీడీఏ వద్ద కూడా గురుకుల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల దీక్ష కొనసాగుతోంది. గత 20 రోజులుగా నిరసనలు చేపడుతున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని, సీఆర్‌టీలతో సమానంగా వేతనం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. గిరిజన, ప్రజా సంఘాల నేతలు వారికి మద్దతు తెలిపారు.

విధుల్లో అలసత్వం వహించొద్దు

● జీసీసీ డీఎం మహేంద్ర



గోదాములో సరుకులను పరిశీలిస్తున్న జీసీసీ డీఎం

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని పార్వతీపురం జీసీసీ డీఎం మహేంద్ర హెచ్చరించారు. శు క్రవారం గుమ్మలక్ష్మీపురంలో జీసీసీ బ్రాంచి కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సంద ర్భంగా జీసీసీ సేల్స్‌మెన్, సీసీపీఏలతో మాట్లాడుతూ.. లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. ఇతర నిత్యావసర సరుకుల అమ్మకాలు , అటవీ ఫలసాయాల కొనుగోలు పెంచాలని సూచించారు. గిరిజనులకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నామన్న విషయం వారికి తెలియజేయాలన్నారు. అవసరమైతే గిరిజన గ్రామాలకు వెళ్లి వారు సేకరించే అటవీ ఫలశాయాలను కొనుగోలు చేయాలని ఆదేశించారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ అమ్మకాలు పెరిగేలా చూడాలన్నారు.

పాలకులు చిత్తశుద్ధితో పనిచేయాలి

● సీపీఎం నాయకుడు రమణారావు

పాలకొండ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పాలకులు చిత్తశుద్ధితో పనిచేయాల’ని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు దావాల రమణారావు కోరారు. నూతన జిల్లా కమిటీ సభ్యులతో శుక్రవారం స్థానిక విలేఖర్లతో ఆయన మాట్లాడారు. ఈనెల 10, 11 తేదీల్లో 150 మంది ప్రతినిధులతో కురుపాం కేంద్రంగా సీపీఎం పదో జిల్లా మహాసభలు జరిగాయన్నారు. భవిష్యత్ ఉద్యమాలు, జిల్లా సమగ్ర అభివృద్ధికి తీర్మానాలు చేశామని తెలిపారు. విద్యం, వైద్యం, ప్రాజెక్టు నిర్మాణాలపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. ట్రూ అప్ చార్జీలకు నిరసనగా ఈ నెల 14న విద్యుత్ బిల్లులు దహనం చేయాలని పార్టీ కార్యకర్తలు, ప్రజలకు పిలుపునిచ్చారు. పాలకొండలో ఇంటింటా కొళాయిలు ఏర్పాటు చేయాలని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలని డిమాండ్ చేశారు.

జాబ్ మేళాలో 15 మంది ఎంపిక

కురుపాం,డిసెంబరు13(ఆంధ్రజ్యోతి): కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన మినీ జాబ్‌మేళాలో 15 మంది ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య తెలిపారు. శుక్రవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ.. బీఎఫ్ఐఎల్ ఫైనాన్స్, డైకిన్, హెల్త్ కార్డు కంపెనీ ప్రతినిధులు 33 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించి 15 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి ఎస్.మనోజ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

జాబితాలో రైతుల పేర్లేవీ?

భామిని, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో కీసర, కోసలి, సతివాడ, పసుకుడి ఓటరు జాబితాలో పలువురి రైతుల పేర్లు లేవని టీడీపీ, వైసీపీ నాయకులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వారు తహసీల్దార్ ఎస్.అప్పారావు, ఇరిగేషన్ ఏఈ పి.మధును ప్రశ్నించారు. దీనిపై ఇప్పటి వరకు తమకు సమాచారం అందలేదన్నారు. ఇలా అయితే ఎన్నికలు ఎలా నిర్వహిస్తారన్నారు. మరోవైపు చనిపోయిన రైతుల పేర్లు కూడా తొలగించలేదన్నారు. అర్హులు కూడా నమోదు కాలేదని తెలిపారు.

పీహెచ్‌సీల పరిశీలన



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న దృశ్యం

సీతంపేట రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): సీతంపేట మండలంలో కుసిమి, దోనుబాయి పీహెచ్‌సీలను వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ల్యాబ్‌లో వైద్య పరికరాల పనితీరు గమనించారు. పీహెచ్‌సీల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని సూచించారు. మందుల నిల్వలు, వినియోగం, కుక్క, పాముకాటు ఇంజక్షన్‌లు అందుబాటులో ఉన్నాయా?లేవా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పర్యవేక్షకులు రోజూ క్షేత్రస్థాయిలో సందర్శించి ఆరోగ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. వైద్యాధికారులు చాందిని, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లర్ల దోపిడీ అరికట్టండి

● సబ్ కలెక్టర్‌కు రైతు సంఘాల వినతి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

పాలకొండ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మిల్లర్లు సిండికేట్‌గా మారి క్వింటాకు ఐదు కేజీలు ధాన్యాన్ని రైతు నుంచి అదనంగా తీసుకుంటున్నారని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు తెలిపారు. రైస్ మిల్లర్ల దోపిడీని అరికట్టాలని శుక్రవారం పాలకొండ సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. కౌలు రైతులు ఆన్‌లైన్‌లో నమోదు అయినప్పటికీ గుర్తింపు కార్డులు లేకపోవడంతో దళారులకు పంటను అమ్ముకోవాల్సి వస్తుందన్నారు. రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులపై మాట్లాడే హక్కు వైసీపీకి లేదు

● ఎమ్మెల్యే విజయచంద్ర



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతుల గురించి మాట్లాడే హక్కు వైసీపీకి లేదని ఎమ్మెల్యే బోనెల విజయచం ద్ర అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ... కలెక్టరేట్ వద్ద వైసీపీ నాయకులు ధర్నా చేయడం చూస్తుంటే ఆశ్చర్యంగా ఉందన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు గత ఐదేళ్లు సకాలంలో డబ్బులు చెల్లించని వారు నేడు ఆందోళనలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రైతే రాజు అనే నినాదంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లో రైతుల ఖాతాలకు నగదు జమ చేస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా అన్నదాతలకు నచ్చిన మిల్లులకు ధాన్యం విక్రయించుకునే స్వేచ్ఛ కల్పించినట్లు వెల్లడించారు. విద్యుత్ చార్జీల పెంపునకు కారణమైన వైసీపీ ఆందోళన చేస్తే ప్రజలు నవ్వుకునే పరిస్థితి కనిపిస్తుందన్నారు.

రైతులను దగా చేసింది వైసీపీయే..



సమావేశంలో మాట్లాడుతున్న పడాల భూదేవి

పాలకొండ: ఐదేళ్లలో రైతులను దగా చేసింది వైసీపీ ప్రభుత్వమేనని టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నప్పుడు రైతులను పట్టించుకోని వైసీపీ ఇప్పుడు నిరసనలకు దిగడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గతంలో భూసార పరీక్షలు నిర్వహించలేదన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు, నాణ్యమైన ఎరువులు కూడా అందించలేదన్నారు. నేడు రైతులకు అండగా వైసీపీ అంటూ వారిపై కపట ప్రేమ కురిపిస్తుందని విమర్శించారు. టీడీపీనాయకులు సింహాద్రి, రమణమూర్తి, సర్వారావు, పైడిరాజు, నారాయణరావు తదితరులున్నారు.

అభ్యర్థులకు ఎమ్మెల్యే అభినందనలు

పార్వతీపురం రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం నియోజకవర్గ పరిధి బలిజిపేట, సీతానగరం, పార్వతీపురం మండలాల్లోని నీటి సంఘాల ఎన్నికల్లో పోటీ చేయనున్న టీసీ అభ్యర్థులను శుక్రవారం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అభినందించారు. పార్టీ కోసం పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన వారికి పార్టీ కండువా వేసి ఎమ్మెల్యే ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, బోను దేవిచంద్రమౌళి, బార్నాల సీతారాం, రెడ్డి చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా టీడీపీ సభ్యత్వ నమోదు

పాలకొండ, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): రాజుపేట గ్రామంలో శుక్రవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. టిడిపి నాయకుడు గుమ్మడి సింహాద్రి ఆధ్వర్యంలో మహిళలు, వృద్ధులు, యువకులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సభ్యత్వం నమోదు చేసుకున్నారు. టీడీపీ నాయకులు గోపాలకృష్ణ, నాయుడు, ఆనందరావు, సత్తిబాబు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఏ-1 పరీక్షల పరిశీలన

బలిజిపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బలిజిపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్ఏ-1 పరీక్షలను శుక్రవారం ఎంఈవో-1 సామల సింహాచలం పరిశీలించారు. చక్కటి చేతిరాతతో జవాబులు రాయాలని, సమయాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాలని విద్యార్థులకు సూచించారు. పరీక్ష పత్రాలను ఆయా స్కూల్ కాంప్లెక్స్ వారీగా అందించామన్నారు. ప్రశ్నా ప్రతాలు లీక్ కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. విధుల నిర్వహణలో అలసత్వం పనికిరాదన్నారు. ఆయన వెంట హెచ్‌ఎం పి.శ్రీనివాసరావు, స్టాఫ్ సెక్రటరీ ఎం.పైడిపునాయుడు పాల్గొన్నారు.

‘అందుబాటులోకి తీసుకొస్తాం’

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సీతంపేట రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతాలపై ఐటీడీఏ శీతకన్ను పేరిట ఇటీవల ‘ఆంధ్రజ్యోతి’లో ప్రచురితమైన కథనంపై సంబంధిత అధికారులు స్పం దించారు. ఈ మేరకు సీతంపేట ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌లో మరమ్మత్తులకు గురైన ఆల్‌టెర్రయిన్ వాహనాలు, పారా మోటారింగ్ ను అందుబాటులోకి తీసుకొస్తామని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్ కుమార్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆడలి వ్యూ పాయింట్ కు వెళ్లే మార్గంలో మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు.

న్యూస్ బాక్స్

రేపు పొట్టి శ్రీరాములు వర్ధంతి

పార్వతీపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్టు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది హాజరు కావాలన్నారు.

రేపు విశాఖ స్టీల్ ప్లాంట్‌లో అపూర్వ నేస్తం-82

బొబ్బిలి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఈనెల 15న అపూర్వ నేస్తం-82 (బాల్యమిత్రుల ఆత్మీయ కలయిక) కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆ సంస్థ ప్రతినిధులు విజయమోహనరావు, ఇనుగంటి విజయకుమార్, పాలవలస శ్రీను తదితరులు తెలిపారు. శుక్రవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. బొబ్బిలి సంస్థానం హైస్కూలులో 1982 సంవత్సరం పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో సత్తారపు నాగేంద్ర, బోర్ల నరిసింగరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి: డీఎస్పీ

రామభద్రపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన మహిళా పోలీసులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగంపై నిఘా పెట్టాలన్నారు. అలాగే ఇటీవల దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్న దృష్ట్యా శ్రద్ధ వహించాలన్నారు.

ఆరు నెలలైనా గుంతలు పూడ్చరా?

బొబ్బిలి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు కావస్తున్నప్పటికీ రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చకపోవడం అన్యాయమని కాంగ్రెస్ పార్టీ బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌చార్జి, పీసీసీ మువ్వల శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ హామీల అమలుకు ఎలాగూ నోచుకోలేదు కనీసం రోడ్ల బాగు కోసమైనా పట్టించుకోకపోతే ఎలా.. అని ఆయన ప్రశ్నించారు. బొబ్బిలి రోడ్లపై గుంతలను యుద్ధ ప్రాతిపదికన పూడ్చాలని డిమాండ్ చేశారు.